సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 4 । జనవరి । 2024



ఆకర్షిస్తున్న కళాకృతులు
విశాఖ నగర సుందరీకరణలో భాగంగా ఎండాడ, కొమ్మాది ప్రధాన కూడళ్ల వద్ద కళాకృతులు ఆకట్టుకుంటున్నాయి.



వైభవంగా దీపారాధన
విశాఖ: లలితానగర్ లలిత పీఠంలోని శ్రీరంగనాథస్వామి, గోదాదేవి సన్నిధిలో ధనుర్మాస దీపార్చన నిర్వహించారు.



ఘనంగా సారె ఊరేగింపు
కశింకోట: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

గ్రామసభలో 399 దరఖాస్తుల స్వీకరణ



అధికారులకు దరఖాస్తులు అందజేస్తున్న స్థానికులు

చింతూరు: అవార్డు ఎంక్వైరీలో భాగంగా బుధవారం చింతూరులో నిర్వహించిన పోలవరం గ్రామసభకు 399 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విక్టర్‌బాబు మాట్లాడుతూ పోలవరం ముంపునకు గురయ్యే గృహాలకు సంబంధించి యజమానులు సంబంధిత కట్టడాలు తమ సొంతమేనని నిరూపణ చేసుకునే నిమిత్తం ఈ గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా గృహాల యజమానుల నుండి పలు ధ్రువపత్రాలు స్వీకరిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి అందరూ అన్నిరకాల ధ్రువపత్రాలను తప్పనిసరిగా అందించాలని ఆయన సూచించారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన అవసరం

- చింతపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సురేష్‌కుమార్



యువతకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఏడీఆర్ సురేష్ కుమార్, ఏటీఎంఏ పీడీ ఆశాదేవి

చింతపల్లి రూరల్ : ఫుడ్ ప్రాసెసింగ్‌పై గిరి యువతకు అవగాహన అవసరమని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎం సురేష్ కుమార్ సూచించారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏటీఎంఏ విశాఖపట్నం వారి సహకారంతో వారం రోజుల పాటు ఫుడ్ ప్రాసెసింగ్ మెషీనరీ వినియోగంపై యువతకు నైపుణ్య శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువతకు బుధవారం ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణ పొందిన యువత నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఏటీఎంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆశాదేవి, శాస్త్రవేతలు డాక్టర్ సీదరి ఉజ్వలరాణి, ఎం.శ్రీనివాసరావు,అగ్రికల్చర్ ఇంజనీరింగ్ నిపుణులు పి.బాబు,శ్రీకాంత్ గౌడ పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న నాటు సారా పాకెట్లు

ముంచంగిపుట్టు: స్థానిక సంతబయలులో సారా విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. సారా అమ్ముతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేసి నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. ముంచంగిపుట్టు గ్రామానికి చెందిన పాంగి కమలమ్మ, శిరగం పార్వతమ్మ, గంపరాయి మోనిమ, నాయకం శంకర్‌రావు, చెండా పాపారాయుడు, సుజనకోట పంచాయతీ కేంద్రానికి చెందిన లబుడు రత్నకుమారిల నుంచి 12 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

మైనర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

విశాఖ : మైనర్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి దరి గల్లవాని పాలెం ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో గత నెల 31న రాత్రి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆ సమయంలో పక్క అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న చాగంటి ప్రసాదరావు(58) అక్కడికి వచ్చి అందరూ ఆటపాటల్లో ఉన్న సమయంలో ఏడేళ్ల బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. వేడుకల అనంతరం ఆ చిన్నారి తన తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో వారు సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించి, ప్రసాదరావు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు గుర్తించారు. ఈ మేరకు బుధవారం దువ్వాడ పోలీసులకు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీతాళంకు ఊపిరి

అంతరించిపోతున్న అరుదైన శ్రీతాళం (తాళపత్ర) వృక్ష జాతిని పరిరక్షించేందుకు పందిరిమామిడి పరిశోధన స్థానంలో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. వీటి పత్రాలపైనే గ్రంథాలను నిక్షిప్తం చేయడం వల్ల పూర్వం నుంచి ఈ వృక్షాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇవి పూస్తే కరువు వస్తుందన్న మూఢనమ్మకం కారణంగా విచక్షణారహితంగా నరికేయడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో కనుమరుగు అవుతున్న ఆ వృక్షజాతి సంరక్షణకు పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు కసరత్తు మొదలుపెట్టారు.



పందిరిమామిడి పరిశోధన స్థానం నర్సరీలో అభివృద్ధి చేసిన శ్రీతాళం మొక్కలు

- అంతరించిపోతున్న జాతి పరిరక్షణకు విస్తృత పరిశోధనలు
- గుంటూరు జిల్లా నారకోడూరులో చెట్టు నుంచి విత్తనాల సేకరణ
- పందిరిమామిడి ఉద్యానవన పరిశోధన స్థానంలో నర్సరీ పెంపకం
- వెయ్యి మొక్కలను అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలు



శాస్త్రవేత్తలు సేకరించిన విత్తనాలు



గుంటూరు జిల్లా నారకోడూరులో శాస్త్రవేత్తలు గుర్తించిన శ్రీతాళం చెట్టు (పూత దశ)

రంపచోడవరం: అరుదైన శ్రీతాళం వృక్ష జాతిని భావితరాలకు అందించేందుకు పందిరిమామిడిలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధనస్థానం (హెచ్ఆర్ఎస్) తొలి అడుగు వేసింది. రామాయణ, భాగవతం, చరిత్ర ఇతిహాసాలు, అన్నమయ్య కీర్తనలు, బ్రహ్మంగారి కాలజ్ఞానం వంటివి శ్రీతాళం (తాళపత్ర వృక్షం) చెట్ల పత్రాలపైనే రాశారు. తాటి వృక్షాన్ని పోలిఉండే ఈ చెట్టు పూస్తే కరువు వస్తుందనే మూఢనమ్మకం ఆ జాతి చెట్ల మనుగడకు శాపంగా మారింది. అక్కడక్కడ అరుదుగా కనిపిస్తున్న శ్రీతాళం చెట్లు అంతరించిపోతున్న వృక్షాల జాబితాలో చేరాయి. ఇలాంటి అరుదైన శ్రీతాళం చెట్లను నర్సరీలో పెంచి తిరిగి ఆ జాతిని పునరుద్ధరించేందుకు ఇక్కడ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చేపట్టిన పరిశోధనలు సత్ఫలితాలు ఇస్తున్నాయి.

రెండింటికి వ్యత్యాసమిలా..

శ్రీతాళం, తాటి చెట్టుకు దగ్గర పోలికలు ఉన్నా రెండింటిలో చాలా తేడాలు ఉన్నాయి. తాటి నాటిన 15 ఏళ్లకు ఫలసాయం ఇస్తుంది. వందేళ్ల వరకు తాటి నుంచి నీరా, కాయలు, ఇతర ఫలసాయాన్ని పొందవచ్చు.

- శ్రీతాళం చెట్టు 30 అడుగుల ఎత్తు పెరిగేందుకు సుమారు 50 ఏళ్ల సమయం పడుతుంది. 30 అడుగుల పొడవునా వెన్నుమాదిరిగా పుష్పగుచ్ఛం వస్తుంది. ఈ చెట్టు ఒకసారి పూస్తే చనిపోతుంది. తాటి మాదిరిగా కాకుండా ఈ చెట్టు పూత భిన్నంగా ఉంటుంది. ఈ సమయంలో మాత్రమే దీనిని గుర్తించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

మూఢనమ్మకమే శాపమై..

తీవ్ర వర్షాభావ పరిస్థితులు (క్షామం) నెలకున్న సమయంలో మాత్రమే పూత వస్తుందన్న మూఢనమ్మకం ప్రజల్లో ఉంది. ఇదే వాటి మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ కారణంగా చెట్లను నరికేయడం వల్ల జాతి అంతరించి పోతోంది.

పరిశోధనలకు ఊతం

బ్రహ్మంగారి కాలజ్ఞానం సహా పూర్వ గ్రంథాలన్నీ తాళపత్రాల్లోనే నిక్షిప్తమయ్యాయి. వాటి గురించి విన్న ప్రతిసారీ వందల ఏళ్లు చెక్కుచెదరకుండా ఉండే పత్రాలను ఏ చెట్ల నుంచి సేకరించారనే సందేహం కలుగుతుంది. దానికి సమాధానం రాష్ట్రంలోని గుంటూరు జిల్లా నారకోడూరు గ్రామంలో దొరికింది. రాష్ట్రంలో ఒకేఒక శ్రీతాళం వృక్షం ఇక్కడ మాత్రమే ఉంది. డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ జానకిరామ్ చొరవతో ఈ చెట్టు నుంచి విత్తనాలు సేకరించి మొలకెత్తించే బాధ్యతను పందిరిమామిడి ఉద్యానవన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలకు అప్పగించారు. సీనియర్ శాస్త్రవేత్త డా. కె రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో సుమారు వెయ్యి మొక్కలను అభివృద్ధి చేశారు. ఇక్కడి పరిశోధన స్థానంలో శ్రీతాళం చెట్లతో పాటు పామ్‌లీవ్ జాతికి చెందిన తాటి, ఈత, జీలుగ, కొబ్బరి జాతులను సంరక్షించి అభివృద్ధి చేస్తున్నారు.

నర్సరీ అభివృద్ధికి మూడేళ్లు



పరిశోధన స్థానంలో శ్రీతాళం మొక్కలను అభివృద్ధి చేశాం. 2020లో నారకోడూరులో విత్తనాలు సేకరించి ఫలదీకరించాం. విత్తనాల పెంకు గట్టిగా ఉన్నందున మొలక కోసం కొన్ని ప్రయోగాలు చేశాం. తాటి చెట్లను విచ్చలవిడిగా నరికేస్తున్నారు. ఈ రెండు జాతులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

– డా. రాజేంద్రప్రసాద్, సీనియర్ సైంటిస్టు, హెచ్ఆర్ఎస్, పందిరిమామిడి

1,28,821 మందికి వైఎస్సార్ పింఛను కానుక

- జిల్లాలో రూ.39,03,77,500ల మేర లబ్ధి
- అరకు ఎంపీ గొడ్డేటి మాధవి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న పింఛనుదారులు



వైఎస్సార్ పింఛను కానుక చెక్కును పంపిణీ చేస్తున్న ఎంపీ మాధవి, కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని లక్షా 28 వేల 821మంది లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛను కానుక మొత్తం రూ.39 కోట్ల 3లక్షల 77వేల 500ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి పేర్కొన్నారు. వైఎస్సార్ పింఛను కానుకలో భాగంగా పెరిగిన రూ.3 వేల పింఛను సొమ్మును బుధవారం కాకినాడలో విడుదల చేశారు. ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్‌లో పింఛనుదారులు వీక్షించారు. అనంతరం వారికి పింఛను సొమ్ము నమూనా చెక్కును ఎంపీ మాధవి, కలెక్టర్ సుమిత్‌కుమార్ అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేదల సంక్షేమం లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నెలకు రూ.3వేలకు పింఛను పెరగడంతో పింఛన్‌దారులకు ఆర్థిక భరోసా ఏర్పడిందన్నారు. పింఛన్‌దారులంతా ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పెరిగిన పింఛను మొత్తం మేరకు జిల్లాలోని లబ్ధిదారులందరికీ పంపిణీని ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మురళీ, చింతలవీధి సర్పంచ్ వంతాల సీతమ్మ, ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి, వెలుగు ఏపీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో జోనల్ అధికారులది కీలకపాత్ర



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు : రానున్న సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడంలో జోనల్ అధికారులదే కీలక పాత్ర అని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఎన్నికల నిర్వహణపై బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం జోనల్ అధికారులకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో జోనల్ అధికారులు నిర్వహించాల్సిన బాధ్యతలు, విధి,విధానాలపై అవగాహన కల్పించారు. జోనల్ అధికారులు స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారాలు కలిగి ఉంటారన్నారు. ఎన్నికల్లో విధులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సిబ్బంది సకాలంలో ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలించడం, తిరిగి సకాలంలో తీసుకువచ్చే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే వాహనాలు మార్గం మధ్యలో నిలుపుదల చేయకుండా చూడాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్, సబ్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, డీఆర్వో రమణ, ఎస్‌డీసీ అంబేడ్కర్, టీడబ్ల్యూ ఈఈ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ, పాడేరు నియోజకవర్గ జోనల్ అధికారులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న విద్యార్థినులు

కలుషిత ఆహారం ఘటనపై ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విచారణ



చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న ఎంపీపీ సవలం అమల, ప్రజా ప్రతినిధులు

చింతూరు: మండలంలోని బొడ్డుగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు క్రమంగా కోలుకుంటున్నారు. అస్వస్థతకు గురైన 39 మంది విద్యార్థినులకు చింతూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించగా వారిలో 16 మంది ఆరోగ్యం మెరుగుపడడంతో బుధవారం డిశ్చార్జ్ చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఇంకా 23 మంది విద్యార్థినులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు. ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశాల మేరకు రంపచోడవరం ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్ బుధవారం బొడ్డుగూడెం ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై వివరాలు సేకరించారు. అనంతరం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిసి ప్రస్తుత పరిస్థితిని వివరించారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికను త్వరలోనే ఉన్నతాధికారులకు అందజేస్తామని డీడీ తెలిపారు.

ప్రజా ప్రతినిధుల పరామర్శ

ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ శ్యామల విజయ్ రెడ్డి, ఏడుగురాళ్లపల్లి సర్పంచ్ సవలం సత్తిబాబు బుధవారం పరామర్శించారు. విద్యార్థినులకు మెరుగైన చికిత్స అందించాలని వారు వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు మడివి రాజు, బూత్‌లెవల్ అధ్యక్షుడు మడివి ప్రవీణ్, కురసం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలకు అభినందనల వెల్లువ



అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి అభినందనలు తెలుపుతున్న మత్స్యరాస విశ్వేశ్వరరాజు



చింతపల్లిలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు



పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజుకు అభినందనలు తెలుపుతున్న పార్టీ నేతలు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ సమన్వయకర్తగా పాడేరు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు అసెంబ్లీ సమన్వయకర్తగా మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు అసెంబ్లీ సమన్వయకర్తగా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి నియామకంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పాడేరులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ మాధవికి బుధవారం పాడేరు సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజుతో పాటు అనేక ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు అభినందనలు తెలిపారు. పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు నివాసానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు,కార్యకర్తలు భారీగానే తరలివచ్చి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

జి.మాడుగుల: అరకు పార్లమెంట్, పాడేరు, అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ సమన్వయకర్తలుగా కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, గొడ్డేటి మాధవి నియమించడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, ఎస్ రామకృష్ణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, ఐసరం హనుమంతరావు, మాలన్న, గంగరాజు, ఎంపీటీసీ చిట్టిబాబు, మైనారిటీ సెల్ జిల్లా కన్వీనర్ నాగూరుబాబు పాల్గొన్నారు.

చింతపల్లి రూరల్: అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నియమితులైన పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి బుధవారం అభినందనలు తెలిపారు. చింతపల్లి వచ్చిన ఆమెను చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎంపీపీలు కోరాబు అనూషదేవి, బోయిన కుమారి, చింతపల్లి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, మండల అధ్యక్షులు మోరి రవి, బొబ్బిలి లక్ష్మణ్, చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత పాల్గొన్నారు.

అంతర్లలో..

పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా మత్స్యరాస విశ్వేశ్వరరాజును నియమించడంపై బుధవారం అంతర్లలో ఆ పార్టీ నేతలు కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు.

కొయ్యూరు: వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ సమన్వయకర్త పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి ఎంపీపీ బడుగు రమేష్ అభినందనలు తెలిపారు. బుధవారం నర్సీపట్నంలో ఆమెను ఆయనతోపాటు పార్టీ జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు జల్లి బాబులు, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ జె రాజులమ్మ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రేగటి ముసిలినాయుడు, ప్రచార కార్యదర్శి దోని బాబ్జీ, సర్పంచ్‌లు సోమన్నదొర, రాజ్యలక్ష్మి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు రీముల గంగాధర్, ప్రసాద్, రామరాజు కలిశారు.

ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు

డిప్యూటీ సెక్రటరీ మనోజ్‌కుమార్‌సింగ్



కొండరెడ్డి మహిళలకు గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న డిప్యూటీ సెక్రటరీ మనోజ్‌కుమార్‌సింగ్, పీవో చైతన్య

చింతూరు: ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా మారుమూల కొండరెడ్లకు అభివృద్ధి, పథకాలు త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం డిప్యూటీ సెక్రటరీ మనోజ్‌కుమార్ సింగ్ ఆదేశించారు. మండలంలోని కొండరెడ్ల గ్రామమైన విద్యానగరంను ఐటీడీఏ పీవో కావూరి చైతన్యతో కలసి ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండరెడ్ల గ్రామాల్లో త్వరితగతిన గ్రామసభలు నిర్వహించి ప్రధానమంత్రి జన్‌మన్‌కు సంబంధించిన పథకాలు అందించాలని సూచించారు. కొండరెడ్లకు అందుతున్న వైద్యసేవల గురించి ఆయన వైద్యుల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో 15 మంది ఆధార్‌కార్డులు, 5గురు రైస్‌కార్డులు, 12 మంది జనన ధ్రువీకరణ, 22 మంది కులధ్రువీకరణ పత్రాలు, ఆరుగురు బ్యాంకు ఖాతాలకు, ఆరుగురు ఉపాధి జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వైద్యశిబిరంలో భాగంగా 20 మందికి సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం పీఎం ఉజ్వల పథకం కింద కొండరెడ్లకు గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ మణికుమార్, ఏపీవో సుజాత, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, తహసీల్దార్ సుబ్బారావు, ఎంపీడీవో రవిబాబు, హౌసింగ్ డీఈ దుర్గాప్రసాద్, పీఆర్ డీఈ బుజ్జిబాబు పాల్గొన్నారు.

మన్యంలో తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

- విజృంభిస్తున్న చలిగాలులు
- చింతపల్లిలో 10.5..
- అరకులోయలో 11.5..
- మినుములూరులో 12 డిగ్రీల నమోదు



పాడేరులో కురుస్తున్న పొగమంచు



పాడేరులో చలిమంట కాగుతున్న స్థానికులు

సాక్షి, పాడేరు: మన్యంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. చలి గాలులు విజృంభిస్తున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9గంటల తరువాతే సూర్యోదయం అవుతుంది. బుధవారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 10.5 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీ బోర్డు కార్యాలయంలో 11.5 డిగ్రీలు, మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం నుంచే చలిగాలుల వ్యాప్తితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళలో చలితీవ్రత అధికంగా ఉంటుండడంతో ప్రజలు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.

నిందితునికి రిమాండ్

వై.రామవరం: సారాకేసులో ఓ వ్యక్తిని రిమాండ్‌కు పంపినట్టు స్థానిక ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ తెలిపారు. మండలంలోని గొరబంద(చీడిపాకలు) గ్రామానికి చెందిన వెలుగూరి లక్ష్మణరెడ్డి బుధవారం 15 లీటర్ల సారాతో పట్టుబడగా, అడ్డతీగల కోర్టులో హాజరు పరిచినట్టు చెప్పారు.

6న జిల్లా హాకీ జట్టు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: జిల్లా హాకీ జూనియర్ మెన్ జట్టును ఈ నెల 6న సాలగ్రామపురంలో ఎంపిక చేయనున్నారు. జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో ఆ రోజు మూడు గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. 2005 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు ఎంపికలో పాల్గొనేందుకు అర్హులు. ఎంపికైన జట్టు తిరుపతిలో ఈ నెల 9 నుంచి ప్రారంభకానున్న స్టేట్ అంతర్ జిల్లాల జూనియర్ మెన్ హాకీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుంది.

క్లుప్తంగా

తాండవ పరిసరాలు షూటింగ్‌లకు అనుకూలం


క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నాతవరం : సినిమా షూటింగ్‌లకు తాండవ ప్రాజెక్టు, సరుగుడు సుందరకోట ప్రాంతాలు అనువుగా ఉంటాయని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. నాతవరంలో బుధవారం యుట్యూబ్ చానల్ సినిమాకు ఆయన క్లాప్ కొట్టి ప్రారంభించారు. నాతవరం మండలం వల్సన్నపేట గ్రామానికి చెందిన డైరెక్టర్ ఉర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో కొత్త యుట్యూబ్ సినిమా షూటింగ్ పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతంతో పాటు మైదానప్రాంతంలో కూడా సినిమా షూటింగ్ సన్నివేశాలు చిత్రీకరించేందుకు అనేక ప్రాంతాలున్నాయన్నారు. ఇటీవల కాలంలో తాండవ రిజర్వాయర్, సరుగుడు, సుందరకోట ప్రాంతాల్లో అనేక సినిమాలు చిత్రీకరించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, నేతలు శ్రీనివాస్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

మత్స్యజీవుల మృత్యువాత


రామాద్రి సముద్ర తీరానికి కొట్టుకుని వచ్చిన డాల్ఫిన్, తాబేలు కళేబరాలు

కొమ్మాది: మంగమారిపేట దరి రామాద్రి సముద్రతీరానికి బుధవారం రెండు భారీ డాల్ఫిన్, తాబేలు కళేబరాలు కొట్టుకొచ్చాయి. ఇలా ఒక్కసారిగా మత్స్యజీవులు మృత్యువాత పడి తీరానికి కొట్టుకుని రావడంపై మత్స్యకారులు, పర్యాటక ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ సమీపంలోని పలు సీఫుడ్స్ కంపెనీల నుంచి విడుదలవుతున్న రసాయన వ్యర్థాలు నేరుగా సముద్రంలో కలపడంతో ఇలా మృత్యువాత పడుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. అరుదుగా కనిపించే డాల్ఫిన్స్ మృత్యువాత పడటం బాధాకరమని పేర్కొన్నారు.

ఒకరికి కరోనా

మహారాణిపేట: విశాఖలో ఒకరికి కరోనా సోకింది. గడిచిన 24 గంటల్లో 57 మందికి పరీక్షలు చేయగా.. వీరిలో ఒకరికి కరోనా నిర్ధారణ అయింది. 26 మంది హోమ్ ఐసోలేషన్‌లో, ఐదుగురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 13 మంది డిశ్చార్జ్ అయ్యారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 44 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్


లంకపాకల్లో గిరిజనులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: రానున్న ఎన్నికలకు సంబంధించి రంపచోడవరం నియోజకవర్గంలోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదికలు అందజేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే చెప్పారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశపు హాలు నుంచి బుధవారం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌తో కలిసి తహసీల్దార్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ ఏజెన్సీలోని 399 పోలింగ్ కేంద్రాల్లో సమస్యాత్మకంగా ఉన్న వాటిని గుర్తించాలన్నారు. ఓటరు కార్డుకు సంబంధించిన ఫారం- 6,7,8 పెండింగ్‌లో ఉన్న సమస్యలని వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి అన్ని మండలాలలో సెక్టార్ అధికారులతో ఎప్పటికప్పుడు సమవేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్ని మండలాల్లో తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏజెన్సీలో పీఎం జన్‌మన్ సర్వే ద్వారా కొండరెడ్డి గిరిజనులకు (పీవీటీజీ) సర్వే ద్వారా గుర్తించి ఇళ్ల నిర్మాణం చేస్తామన్నారు. జనవరి 5వ తేదీ నాటికి సర్వే పూర్తి చేసి నివేదికల సమర్పించాలని ఆదేశించారు. ప్రధాని మోదీ ఈ పథకాన్ని ఈనెల 15న ప్రారంభిస్తారన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి మండల పరిధిలో తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు జీసీసీ స్టాక్ పాయింట్ల నుంచి వాహనాల ద్వారా రేషన్ సరఫరా చేసే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సెక్టార్ అధికారులు, పోలీసు అధికారులు, తహసీల్దార్లు తదితరులు ఎప్పటికప్పుడు పోలింగ్ బూత్ స్థాయి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలన్నారు.

పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన

రంపచోడవరం మండలంలోని పలు పోలింగ్ స్టేషన్‌లను సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ బుధవారం పరిశీలించారు. మండలంలోని లంకపాకలు, కొయ్యలగూడెం, పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌ల్లో అన్ని సౌకర్యాలు ఉండాలన్నారు. సబ్ కలెక్టర్ వెంట డీటీ ఎన్.వి.వి.సత్యనారాయణ తదితరులున్నారు.

ఆఖరి గురువారం పూజలకు ఏర్పాట్లు

కనకమహాలక్ష్మి దర్శనానికి పోటెత్తిన భక్తులు


విశేష పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా 21వ రోజు బుధవారం సిరులతల్లిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బుధవారం మధ్యాహ్నం 3 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పూజలు

శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో మార్గశిర మాసం ఆఖరి గురువారం పూజలు బుధవారం అర్ధరాత్రి శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ సంప్రదాయం ప్రకారం వేదమంత్రాలు, నాదస్వరాలతో గణపతి పూజ అనంతరం అమ్మవారికి విశేష పూజలు చేశారు. పరిసర ప్రాంత ప్రజలు తీసుకొచ్చిన పసుపు నీళ్లతో అమ్మవారిని అభిషేకించారు. పెద్ద ఎత్తున క్షీరాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి పసుపు పూశారు. ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించి, అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వెండి కవచం తొడిగారు. ఆలయ ఈవో కె.శిరీష, ప్రధానార్చకుడు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనప్రాప్తి కల్పించారు.

- రీడింగ్ రూమ్ వద్ద ధర్మదర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500 క్యూ టికెట్లు ఇస్తారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించనున్నారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం(వీటీ కాలేజ్ వద్ద), దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్న దృష్ట్యా ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు. జగదాంబ జంక్షన్ మీదుగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు నుంచి టౌన్‌కొత్తరోడ్డు ముందు సందు వద్ద కుడివైపు తిరిగి సూయిజ్‌ఫాం చేరుకోవాలి. అక్కడే వాహనాలు పార్కు చేసి కాలి నడకన అమ్మవారి గుడికి రావాలి.

- కాన్వెంట్ జంక్షన్, అద్వానీ జంక్షన్, రామకృష్ణ జంక్షన్ మీదుగా వచ్చే వాహనాలు సీహార్స్ జంక్షన్ నుంచి టౌన్‌కొత్తరోడ్డు ముందు పార్కింగ్ చేసుకుని కాలినడకన రావాలి.
- వన్‌టౌన్, పాత పోస్టాఫీస్ జంక్షన్ల మీదుగా అమ్మవారి గుడికి వచ్చే ద్విచక్ర వాహనచోదకులు లక్ష్మీటాకీస్, ఎంవీడీఎం హైస్కూల్ మీదుగా కురుపాం మార్కెట్ మెయిన్‌రోడ్డు కిరువైపులా పార్క్ చేసుకోవాలి.
- వన్‌టౌన్, పాత పోస్టాఫీస్ జంక్షన్లు మీదుగా అమ్మవారి ఆలయానికి వచ్చే నాలుగు చక్రాల వాహనదారులు కురుపాం మార్కెట్‌లోని ఖాళీ స్థలంలో పార్క్ చేసుకోవాలి.
- వీఐపీలు, రూ.500 టికెట్ తీసుకునే వారు బీచ్ రోడ్డు మీదుగా టౌన్ హాల్‌కు చేరుకుని.. అక్కడే తమ వాహనాలను పార్క్ చేసుకోవాలి.

ఉచిత బస్సు సౌకర్యం..

అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం మద్దిలపాలెం, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, వేపగుంట, గోపాలపట్నం, ఎన్ఏడీ, కంచరపాలెం నుంచి రెండు ఉచిత బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు ఈవో తెలిపారు. దర్శనానికి వచ్చే భక్తుల కోసం మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు, బిస్కెట్లు అందజేయనున్నామన్నారు.

రేపటి నుంచి ఆంధ్ర-బెంగాల్ రంజీ మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: రంజీ మ్యాచ్‌లో భాగంగా ఈ నెల 5వ తేదీ నుంచి బెంగాల్ జట్టుతో ఆంధ్రా మెన్ జట్టు వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో తలపడనుంది. ఎలైట్ బీ గ్రూప్‌లో జరగనున్న ఈ మ్యాచ్ ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానుందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి తెలిపారు. నాలుగు రోజుల పాటు ఈ మ్యాచ్ జరగనుండగా.. ఇరుజట్లు స్టేడియం బీ గ్రౌండ్ నెట్స్‌లో బుధవారం ప్రాక్టీస్ చేశాయి. గురువారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఆంధ్రా జట్టు, 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు బెంగాల్ జట్టు ప్రాక్టీస్ చేయనుందని తెలిపారు.

- ఆంధ్ర జట్టుకు హనుమ విహారీ నాయకత్వం వహిస్తుండగా.. బ్యాట్ ఝుళిపించేందుకు అశ్విన్ హెబ్బర్, రికీబుయ్, ప్రశాంత్, రషీద్, గిరినాథ్, జ్ఞానేశ్వర్ సిద్ధమవుతున్నారు. పృథ్వీ, శశికాంత్, రాజ్,నితీష్, గిరినాథ్‌రెడ్డి, లలిత్, స్టీఫెన్ చెలరేగే బంతులు వేయనున్నారు. ఆల్‌రౌండర్లుగా మనీష్, షోయబ్ వ్యవహరిస్తారు. స్థానిక ఆటగాడు భరత్ ప్రస్తుతం దక్షిణాఫ్రికా జట్టుతో ఆడే భారత్ జట్టుతో ఉండటంతో కె.పృథ్వీరాజ్ వికెట్ల వెనుక నిలవనున్నాడు. బెంగాల్ జట్టుకు మనోజ్ తివారీ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు.

ఆంధ్రా జట్టు మ్యాచ్‌లు ఇవీ

రెండో మ్యాచ్‌లో ముంబయితో 12వ తేదీ నుంచి తలపడనుండగా మూడో మ్యాచ్‌లో అసోంతో 19 నుంచి ఆడనుంది. 26 నుంచి చత్తీస్‌గఢ్‌తో, ఫిబ్రవరి 2 నుంచి బిహార్‌తో, 9 నుంచి ఉత్తర ప్రదేశ్‌తో, 16 నుంచి కేరళతో లీగ్ పోటీల్లో తలపడనుంది.

ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా బూరె బాబూరావు

దేవరాపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్ర మోనిటరింగ్ కౌన్సిల్ సభ్యుడిగా దేవరాపల్లి మండలంలోని బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబూరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 28న జీవోను జారీ చేసింది. కేటగిరీ-1, కేటగిరి-2, కేటగిరి-3 విభాగాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 9 మందిని నియమించా రు. కేటగిరి-1లో నాన్ అఫీషియల్స్ నుంచి జిల్లాలో బాబురావుకు చోటు లభించింది. ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే పనులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసి మరింత సమర్థవంతంగా పథకం అమలు చేసేలా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందిస్తారు.

ఎంచుకున్న రంగంపై పట్టు సాధించాలి

- ఐఆర్ఎస్ అధికారి ఈదరి రవికిరణ్


ఫ్లూటు ఊదుతున్న ఐఆర్ఎస్ అధికారి ఈదర రవికిరణ్

మధురవాడ: విద్యార్థులు చదువుతోపాటు ఇష్టమైన రంగంపై పట్టు సాధించాలని ఐఆర్ఎస్ అధికారి, కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ అండ్ నార్కోటిక్స్ నేషనల్ అకాడమీ అడిషినల్ డైరెక్టర్ జనరల్ ఈదరి రవికిరణ్ సూచించారు. బుధవారం సాయంత్రం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంసిద్ధత, 21వ శతాబ్దంలో అవసరమైన స్కిల్స్, కెరీర్ గైడెన్స్, తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపన్యాసంతోపాటు వేణుగానం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. మాతృభాషపై పట్టు సాధిస్తే అన్ని భాషలూ సులువుగా నేర్చుకోవచ్చున్నారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా ప్రస్తుత సమాజం ముందుకు సాగుతోందన్నారు. విద్యార్థులు మంచి భావవ్యక్తీకరణ, ప్రశ్నించేతత్వం అలవాటు చేసుకోవాలన్నారు. సమాజంలో అన్ని అంశాలనూ తెలుసుకోవాలన్నారు. నేర్చుకోవాలనే తపన, కృషి ఉంటే ఏమైనా నేర్చుకోవచ్చనీ... అన్నింటికీ గురువే వుండాల్సిన అవసరం లేదన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, ఉపాధ్యాయుడు సోమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు కుమార్ తదితరులు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అదిష్టింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

విద్యార్థుల మందు పార్టీపై నివేదిక ఇవ్వండి

విశాఖ విద్య: అనకాపల్లి జిల్లా చోడవరం పట్టణంలో శని, ఆదివారాల్లో వసతి గృహంలో ఉంటున్న 6, 7, 10 తరగతులకు చెందిన 16 మంది విద్యార్థులు మందు పార్టీ చేసుకున్న ఘటనను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం బీసీ సంక్షేమ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నివేదిక ఆధారంగా చట్ట ప్రకారం చర్యలకు సిఫారసు చేస్తామని ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న వివిధ అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ విషయంపై అన్ని జిల్లాల ఉన్నతాధికారులకు కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. వీటిని ఉల్లంఘించే అధికారులను కమిషన్ ఉపేక్షించదన్నారు.

ప్రాణం తీసిన స్పీడ్ బ్రేకర్

- ఆటో బోల్తా.. డ్రైవర్ దుర్మరణం
- పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబం


సంఘటనా స్థలంలో నరిసింగరావు మృతదేహం, గంద్రెడ్డి నరిసింగరావు (ఫైల్)

ఆనందపురం: మామిడిలోవ వద్ద ఆరులేన్ల జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో బోల్తా పడింది. సంఘటన స్థలంలోనే డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఎస్ఐ గంట్యాడ సంతోష్ తెలిపిన వివరాలివీ.. గండిగుండం గ్రామానికి చెందిన గంద్రెడ్డి నరిసింగరావు(38) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నరిసింగరావు బుధవారం శొంఠ్యాం నుంచి ఆటో నడుపుకుంటూ గండిగుండం వైపు వస్తున్నాడు. మామిడిలోవ వద్దకు చేరుకునే సరికి అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో నరిసింగరావుకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులెవరూ లేరు. అతనికి భార్య జ్యోతి, కుమార్తె జ్యోత్స్న(4) ఉన్నారు. అతని కుమారుడు మనోజ్ (12) అనారోగ్యంతో రెండేళ్ల కిందట మృతి చెందాడు. అతని తల్లిదండ్రులు కూడా మరణించారు. కేవలం నరిసింగరావు సంపాదనపైనే ఆధారపడి జీవిస్తున్న భార్య జ్యోతి, కుమార్తె జ్యోత్స్న దిక్కులేనివారయ్యారు. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని నరసింగరావు మృతదేహం వద్ద బోరున విలపించారు. ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు కుటుంబ సభ్యులను గండిగుండం సర్పంచ్ శ్రీనివాస్ పరామర్శించి ఓదార్చారు.

స్పీడ్ బ్రేకర్ వలనే ప్రమాదాలు

మామిడిలోవ వద్ద ఆరు లేన్ల రహదారి సర్వీసు రోడ్డు పై ఉన్న స్పీడ్ బ్రేకర్ ప్రమాదకరంగా మారింది. అక్కడ సమాంతరంగా కాకుండా ఎగుడు దిగుడుగా ఉంది. దీనిపై జీబ్రా లైన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనచోదకులు దగ్గరకు వచ్చే వరకు స్పీడ్ బ్రేకర్ కనిపించని పరిస్థితి నెలకొంది. దగ్గరకు వచ్చిన అనంతరం ఆకస్మాత్తుగా వాహనాలకు బ్రేక్‌లు వేస్తుండడంతో అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి. ఇక్కడ ఇలా ప్రమాదాలు జరిగి ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్టు స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణ

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న పనుల నిమిత్తం రద్దు చేసిన పలు రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం పునరుద్ధరిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

పునరుద్ధరించిన రైళ్లు

- విజయవాడ-విశాఖపట్నం-విజయవాడ(22702/22701) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5 నుంచి 13వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం ఆయా రోజుల్లో నడుస్తుంది.
- గుంటూరు-విశాఖపట్నం(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నడుస్తుంది.
- విశాఖపట్నం-గుంటూరు(172400 సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నడుస్తుంది.

సికింద్రాబాద్-బ్రహ్మపూర్ మధ్య మరో సంక్రాంతి స్పెషల్ : పండగ వేళ సికింద్రాబాద్-బ్రహ్మపూర్-సికింద్రాబాద్ మధ్య మరో సంక్రాంతి స్పెషల్ రైలును నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం తెలిపారు. సికింద్రాబాద్-బ్రహ్మపూర్(07093) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8, 15 తేదీల్లో సికింద్రాబాద్‌లో రాత్రి 7.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 5.47 గంటలకు బయలుదేరి అదే రోజు ఉదయం 11.15 గంటలకు బ్రహ్మపూర్ వెళ్తుంది. బ్రహ్మపూర్-సికింద్రాబాద్(07094) స్పెషల్ రైలు ఈ నెల 9, 16వ తేదీల్లో బ్రహ్మపూర్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 5.12 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ వెళ్తుంది.